ప్రభుత్వం పట్టించుకోలేదని..!

బొమ్మనహాళ్‌లోని ఎమ్మార్సీ కార్యాలయ భవనాన్ని చందాలతో సిబ్బంది మరమ్మతు చేసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళనకు గురయ్యేవారు. వాన కురిస్తే పెచ్చులూడి నీరు కారుతుండేది. గోడలు నెర్రెలు చీలి పెళ్లలు విరిగిపడిన సందర్భాలున్నాయి. భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వానికి కొన్నేళ్ల నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా విదల్చలేదు. దీంతో ప్రాణాల మీదకు వచ్చేదాకా ఆగడం ఎందుకని ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు చందాలు వేసుకున్నారు. సుమారు రూ.3 లక్షలు వెచ్చించి భవనానికి మరమ్మతులు చేయించారు. రంగులు వేయించారు. మరికొన్ని పనులు జరగాల్సి ఉందని వారు అన్నారు.

- బొమ్మనహాళ్



పాపం.. కౌలు రైతు..!

- సగం మందికీ అందని గుర్తింపు కార్డులు
- రైతు భరోసా కూడా కొందరికే వర్తింపు
- మూడో విడత సొమ్ముకోసం నిరీక్షణ



అనంతపురం అర్బన్, మార్చి 13: కౌలు రైతుల కష్టాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో కనీసం సగం మందికీ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. గుర్తింపు కార్డులు ఉన్నవారిలో కొందరికే రైతు భరోసా పథకం ద్వారా సాయం అందిస్తున్నారు. తాజాగా మూడో విడత రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. గత నెల 28న సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి కౌలు రైతులకు మూడో విడత రైతు భరోసా సొమ్ము విడుదల చేశారు. కానీ రెండు వారాలు గడిచినా ఇప్పటి దాకా జిల్లాలో ఒక్క కౌలు రైతు ఖాతాలోనూ సొమ్ము జమకాలేదు. కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఏడా మూడు విడతల్లో రైతు భరోసా సొమ్ము రూ.13,500 ఇస్తోంది. తొలి విడత రూ.7500, రెండో విడత రూ.4 వేలు, మూడో విడత రూ.2 వేలు జమ చేస్తోంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి మూడో విడత సొమ్మును సీఎం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,019 మంది కౌలు రైతులకు రూ.2వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. ఎన్నికలు సమీపిస్తున్నాయని, ఎప్పటిలోగా తమకు రైతు భరోసా సొమ్ము జమచేస్తారో తెలియడం లేదని కౌలు రైతులు అంటున్నారు.

సీసీఆర్‌సీ కార్డుల జారీలో వివక్ష



జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారు. కానీ ఏటా అరకొరగానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. 2019-20 సంవత్సరంలో 2,160 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. 2020-21లో 831, 2021-22లో 2,022, 2022-23లో 2,149, 2023-24లో 6,900 మందికి సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. అర్హులైన కౌలు రైతులందరికీ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఏటా తక్కువ సంఖ్యలో టార్గెట్ ఇస్తోంది. కొందరికే గుర్తింపు కార్డులను ఇస్తోంది. నిబంధనల పేరిట ప్రభుత్వం కౌలు రైతుల సంఖ్యను కుదిస్తోంది.

నిర్లక్ష్యం తగదు..



కౌలు రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు. జిల్లాలో 30వేల మంది కౌలు రైతులు ఉన్నారు. కానీ అతి తక్కువ మందికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, అందరికీ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలి. సీఎం జగన్ బటన్ నొక్కి రెండు వారాలు గడిచినా కౌలు రైతులకు మూడో విడత డబ్బులు అందలేదు. ఒక్కరి ఖాతాలోనూ సొమ్ము జమ కాలేదు. ఎన్నికల కోడ్ అమలుకు ముందే డబ్బులు జమ చేయాలి.

- బాల రంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

2023-24 సంవత్సరంలో 6,900 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసినా, వీరిలో 3019 మందికి మాత్రమే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేశారు.ప దీంతో మిగిలిన కౌలు రైతులకు అన్యాయం జరిగింది.

జమ కాలేదు..



దేవదాయ శాఖ పరిధిలోని పెన్నహోబిళం ఆలయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. నాకు సీసీఆర్‌సీ కార్డు ఇచ్చారు. ఈ ఏడాది రెండు విడతల రైతు భరోసా సొమ్ము జమైంది. మూడో విడత డబ్బులు రూ.2వేలు ఇంకా జమ కాలేదు. ఎన్నికల కోడ్ త్వరలో అమలులోకి వచ్చే అవకాశం ఉంది. అప్పటిలోగా డబ్బులు జమచేయాలి.

- మురళి, కౌలు రైతు, మోపిడి, ఉరవకొండ మండలం





ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం

విధులకు దూరంగా ఇంజనీర్లు

అక్రమాల ఆర్‌డబ్ల్యూఎస్

- పనుల్లో నాణ్యతకు తిలోదకాలు
- పర్సెంటేజీలపైనే అధికారుల చూపు

అనంతపురం న్యూటౌన్, మార్చి 13: ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అక్రమాలకు అడ్డు అదుపూ లేదన్న ప్రచారం జరుగుతోంది. ఎవరు పర్సెంటేజీ ఎక్కువ ఇస్తే వారి ఫైల్‌కు మోక్షం లభిస్తోందన్న విమర్శలున్నాయి. ముడుపులు ముట్టజెప్పనిదే ఏ ఫైలూ ముందుకు కదలదని అంటున్నారు. ప్రధానంగా జలజీవన్ మిషన్ కింద చేపట్టే అభివృద్ధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని తెలిసింది. జలజీవన్ మిషన్ పథకం నిబంధనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో వ్యవహారాలు సాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ పథకం సొమ్ము పక్కదారి పడుతోందని అంటున్నారు. యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగి తేలుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పర్సెంటేజీ ఇస్తే క్షేత్రస్థాయిలో పనులు ఎలా జరిగాయో కూడా చూడకుండానే ఆమోదం తెలుతుపున్నారని ప్రచారం జరుగుతోంది. ఫలితంగా అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపాలకు అంతులేకుండా పోతోంది. వీటన్నింటిని పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన ఆ శాఖ ముఖ్య అధికారిపైనా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి.

చుట్టపు చూపు..



విజిలెన్స్ అధికారుల విచారణ (ఫైల్)

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పని చేసే డీఈలు చుట్టపుచూపుగా కార్యాలయానికి వస్తున్నారు. ఫీల్డ్‌కు వెళ్లారని కిందిస్థాయి సిబ్బంది చేత చెప్పిస్తున్నారేగాని, విధులకు డుమ్మా కొడుతున్నారని సమాచారం. జిల్లా కేంద్రంలోనే మచ్చుకూ కనిపించని డీఈలు కూడా ఉన్నారంటే పరిస్థితి ఎంతదారణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విధులకు హాజరుకాని వారికి వేతనాలు ఇవ్వడం దండగ అని పలువురు విమర్శిస్తున్నారు. అసలే వేసవి. ఎక్కడ చూసినా తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి సమయంలో సిబ్బందికి అందుబాటులో ఉండి, తగిన సూచనలు ఇవ్వాల్సిన ఎస్ఈ కూడా కార్యాలయానికి చుట్టపు చూపుగా వస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆయన నిత్యం సత్యసాయి ప్రాజెక్ట్ కార్యాలయానికే పరిమితమవుతున్నారని అంటున్నారు.

అక్కడ దందా..?

సత్యసాయి ప్రాజెక్ట్ కార్యాలయంలో అవినీతి దందా నడుస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. పనులకు సంబంధించి పర్సెంటేజీలను అక్కడే మాట్లాడుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఓ డీఈకి ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం లేదని, అయినా మొత్తం తతంగాన్ని నడిపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారి కార్యాలయానికి వచ్చినపుడు సైతం పనుల గురించి కాకుండా, పర్సెంటేజీల గురించే చర్చ నడుస్తోందని అంటున్నారు. అలా పర్సెంటేజీలు ముట్టజెప్పినవారి ఫైల్స్‌పై మాత్రమే సంతకాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.



ఎస్ఎస్ ట్యాంక్‌లో దారుణంగా ఉన్న ఫిల్టర్ బెడ్స్

నాణ్యతకు తిలోదకాలు

కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఇటీవల విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతాలోపాలపై క్లాస్ పీకినట్లు తెలిసింది. సత్యసాయి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అనంతపురం రూరల్ మండలంలోని పలు పంచాయతీలు, రాప్తాడులోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరుగుతుంది. సరిగా శుద్ధి చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇదే అంశంపై విజిలెన్స్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పీఏని కలవండి..

ఏదైనా సమస్య పరిష్కారం కోసం ఎస్ఈని కలవడానికి వచ్చిన వారికి నిరాశ ఎదురవుతోంది. పీఏని కలవాలని ఉచిత సలహా ఇచ్చి పంపుతున్నారని సమాచారం. ఎస్ఈతో మాట్లాడాల్సిన అంశాలకు పీఏ వద్ద పరిష్కారం ఎలా లభిస్తుందని బాధితులు వాపోతున్నారు. అక్రమాల ఆరోపణలపై వివరణ కోరడానికి కూడా ఎస్ఈ అవకాశం ఇవ్వడంలేదు.

డీపీఓలో బదిలీలలు

- సిఫార్సులకు పెద్దపీట
- నిబంధనలకు మంగళం
- గ్రేడ్స్ పాటించని అధికారులు



అనంతపురం న్యూటౌన్, మార్చి 13: జిల్లా పంచాయతీ కార్యాలయంలో బది'లీలలు' మొదలయ్యాయి. బదిలీలు లేవని చెబుతూనే.. అధికార పార్టీ నాయకుల సిఫార్సులకు సై అంటున్నారు. అధికార యంత్రాంగం రాత్రికి రాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఈ క్రమంలో నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. గ్రేడ్స్‌కు సైతం మంగళం పలకడంతో సీనియర్లు లబోదిబోమంటున్నారు. డీడీఓల నియామకంలో సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక నాయకుల సిఫార్సుల మేరకు సిబ్బందిని నియమించారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు గ్రేడ్-1, గ్రేడ్-2 సీనియార్టీ ప్రకారం బదిలీలలో ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు గ్రేడ్స్‌కు మంగళం పలికేలా ఉన్నాయని సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతుల విషయంలో కూడా తీవ్ర గందరగోళం నెలకొనే పరిస్థితి ఉందని, అయినా ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయక తప్పడం లేదని అధికారులు అంటున్నారు.

మచ్చుకు కొన్ని..

- అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి పంచాయతీకి గ్రేడ్-1 సెక్రటరీగా రమాదేవి ఉండేవారు. ఆమెకు ఏఓగా ఉద్యోగోన్నతి రావడంతో తాడిమర్రి పంచాయతీకి వెళ్లారు. నిబంధనల ప్రకారం ఆమె స్థానంలో మరో గ్రేడ్-1 సెక్రటరీని నియమించాలి. కానీ గ్రేడ్-4 సెక్రటరీ సర్దార్‌ను నియమించారు.
- రుద్రంపేట పంచాయతీ సెక్రటరీగా నరసింహారెడ్డి ఈఓఆర్డీగా ఉద్యోగోన్నతి పొంది, రాప్తాడు మండలానికి వెళ్లారు. ఆ స్థానంలో తాత్కాలికంగా కురుగుంట పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లాను నియమించారు. ప్రస్తుతం ఆయన్ను తప్పించి గ్రేడ్-1 సెక్రటరీని నియమిస్తారనుకుంటే.. నిబంధనలకు విరుద్ధంగా, సిఫార్సులకు పెద్ద పీట వేస్తూ.. గ్రేడ్-4 సెక్రటరీ మల్లికార్జున రెడ్డిని నియమించారు.
- రాప్తాడు పంచాయతీ సెక్రటరీ పెద్ద శ్రీనివాసులును శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రానికి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బదిలీ చేశారు. కానీ వారం గడిచినా ఆయన రిలీవ్ కాలేదు. ఇక్కడికి మరొకరిని నియమించలేదు. ఒత్తిళ్ల నేపథ్యంలో ఎవరో ఒకరికి ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇవ్వాలని డీపీఓ కార్యాలయం నుంచి ఎంపీడీఓకు సూచించారని సమాచారం. ఈ నేపథ్యంలో రాప్తాడుకు గ్రేడ్-1 సెక్రటరీని నియమిస్తారా..? లేక సిఫార్సులకు తలొగ్గి నిబంధనలకు పాతరేస్తారా అన్న చర్చ జరుగుతోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	: గురువారం సాయంత్రం 06:31
సెహరీ	: శుక్రవారం ఉదయం 05:11

వివాదాలకు నిలయం..

రాప్తాడు పంచాయతీ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ పాలకవర్గం కొలువుదీరినప్పటి నుంచి బాధ్యతలు చేపట్టిన కార్యదర్శులందరూ అధికార పార్టీ స్థానిక నాయకుల చేతిలో బలి అయ్యారనే ప్రచారం ఉంది. తెలుగుదేశం పార్టీ మద్దతుదారు సర్పంచ్ కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. సర్పంచ్‌ను కాదని, అధికార పార్టీవారి కనుసన్నల్లో కార్యదర్శులు పనిచేయాల్సి వస్తోందని, దీంతో వివాదాలు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఆరు నెలలు కూడా పనిచేయకనే కార్యదర్శులు ఇక్కడి నుంచి బదిలీ అవుతున్నారు. కొందరు సస్పెండ్ అయ్యారంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మీ సేవలో అగ్నిప్రమాదం

రూ.30 లక్షల ఆస్తి నష్టం

ధర్మవరం రూరల్, మార్చి 13: కనగానపల్లి మీ సేవ కేంద్రంలో బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అందులో ఉన్న విలువైన ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు గురుప్రసాద్ తెలిపారు. కనగానపల్లి ప్రధాన వీధిలో ఉన్న మీ సేవ కేంద్రం భవనంలోనే అఖిల మణికంఠ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. అందులో ఫ్రిజ్‌లు, టీవీలు విక్రయిస్తుంటారు. దుకాణంలో ఉన్న ఓ ఫ్రిజ్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి.. ఇతర వస్తువులకు వ్యాపించాయి. చుట్టుపక్కలవారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈలోగా దుకాణంలో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు విన్నవించాడు.



మంటల్లో కాలిపోతున్న దృశ్యం

చిత్రావతిలో మళ్లీ ఇసుక దందా

వాహనాలను అడ్డుకున్న పోలీసులు

యల్లనూరు, మార్చి 13: మండల పరిధిలోని చిత్రావతి నది నుంచి అనుమతి లేకుండా బుధవారం భారీగా ఇసుకను తరలించారు. సమాచారం అందుకున్న యల్లనూరు ఎస్ఐ గిరిబాబు ఆ ప్రాంతానికి వెళ్లి వాహనాలను వెనక్కి పంపించారు. తిరుమలాపురం సమీపంలో భారీ యంత్రాల సాయంతో ఇసుకను తోడుకుని లారీలు, టిప్పర్ల ద్వారా తరలింపు ప్రారంభించారు. అనుమతి లేకుండా ఎలా తరలిస్తున్నారని ఎస్ఐ టిప్పర్ డ్రైవర్లను ప్రశ్నించారు. దీంతో రీచ్ వద్ద ఉన్నవారు అనుమతులు వచ్చాయని అన్నారు. సమస్య తలెత్తడంతో ఇప్పటికే రెండుసార్లు ఇసుక తవ్వకాలను ఆపామని, పోలీస్‌స్టేషన్‌లో అనుమతి పత్రాలు ఇవ్వకుండా ఇసుకను ఎలా తరలిస్తారని ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడకు వచ్చిన టిప్పర్, లారీలను వెనక్కి పంపించేశారు. అనుమతులు చూపించిన తర్వాతనే ఇసుక రీచ్ వద్దకు వాహనాలు రావాలని, లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణా చేస్తున్నది ఎమ్మెల్యే బంధువేనని అక్కడున్న వాహన డ్రైవర్లు చెప్పడం గమనార్హం.



టిప్పర్‌ను వెనక్కి పంపుతున్న ఎస్ఐ

డీఆర్‌డీఏ-వైకేపీలో పీపీఎం..!

ముడుపు కడితే సస్పెన్షన్ల రద్దు..?

- జోరుగా రియల్ దందా.. సెటిల్‌మెంట్లు
- ఓ ప్రజాప్రతినిధి వద్ద అనధికారిక విధులు

డీఆర్‌డీఏ-వైకేపీలో ఓ అధికారి వసూళ్లకు అంతులేకుండా పోతోంది. అక్రమాలను ప్రశ్నించేవారిని దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. భజనపరులు, అధికారపార్టీ నేతల అండ ఉన్నవారికి అడిగిన చోట కొలువు ఇస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా డీఆర్‌డీఏ-వైకేపీ మాజీ పీడీ, ప్రస్తుత అధికారపార్టీ ప్రజాప్రతినిధి వద్ద ఓ ఏపీఎం అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు. లైవ్‌స్టాక్, వైఎస్సార్ బీమా కాల్ సెంటర్‌లో ఉద్యోగం పేరుతో ఆయన జీతం తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆ ప్రజాప్రతినిధి వద్ద ఒకరు అధికారికంగా పీఏగా ఉన్నారు. అదనంగా ఉన్న ఏపీఎం.. ఆ ప్రజా ప్రతినిధి పేరిట హల్‌చల్ చేస్తున్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్



వైఎస్సార్ బీమా కాల్ సెంటర్

నచ్చిన వారికి అందలం



డీఆర్‌డీఏ-వైకేపీలో నచ్చిన ఉద్యోగులకు అందలం ఎక్కిస్తున్నారు. ప్రశ్నించిన ఉద్యోగులపై కక్షసాధింపులు చర్యలకు దిగుతున్నారు. అనధికారికంగా ఆ ప్రజాప్రతినిధి వద్ద ఉంటున్న ఉద్యోగి.. ఆయన ప్రైవేటు అంశాలు, రియల్ ఎస్టేట్, ఇతర వ్యవహారాలను చూసుకుంటున్నారు. ఆ ప్రజాప్రతినిధి పేరుతో పంచాయతీలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఒకే సామాజికవర్గం కావడంతో ఆ ప్రజాప్రతినిధికి ఏకంగా ఆయన అనుచరుడిగా మారిపోయారు.

వాటా ఇవ్వాల్సిందే..

డీఆర్‌డీఏ-వైకేపీలో చేపట్టే ప్రతి పనిలోనూ ఆ అధికారికి కమీషన్ ఇవ్వాల్సిందే అని అంటున్నారు. వాటా లేకపోతే ఆ పని ఆగిపోతుందని అంటున్నారు. శిక్షణలు, గణతంత్ర దినోత్సవ శకటం, జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన తెలుగు మహాసభలు.. ఇలా పలు కార్యక్రమాల నిధుల నుంచి ఆయనకు ఏకంగా రూ.30 లక్షలు వరకు ముడుపులు అందినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా ప్రశాంతి సమాఖ్య ద్వారా నడుపుతున్న జనరిక్ మందుల షాపు నుంచి ప్రతి నెల రూ.2లక్షలు వరకు ఆ అధికారికి అందుతున్నట్లు తెలుస్తోంది. పశుసంవర్ధక శాఖలో ఓ మండలస్థాయి అధికారిని డీఆర్‌డీఏ-వైకేపీలో లైవ్‌స్టాక్ ఏపీడీ పేరుతో తీసుకువచ్చారని, జిల్లా స్థాయి పోస్టు ఇచ్చి జనరిక్ మందుల షాపు తతంగాన్ని నడిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.



కాల్‌సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఏపీఎం సీటు

ముడుపులు ఇస్తే..

సస్పెండ్ అయిన డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు.. ముడుపులు ఇస్తే తిరిగి విధుల్లోకి చేర్చుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఓ అధికారి నాలుగున్నరేళ్లలో మొత్తం 16మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వీరిలో కొందరు ఉద్యోగుల నుంచి రూ.2లక్షలు వరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. విడపనకల్లులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి.. సిబ్బందిలో కొందరిని లైంగికంగా వేధించినట్లు అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. విచారించి చర్యలు తీసుకోవాల్సిన ఓ ఉన్నతాధికారి.. అధికారపార్టీ నేత సిఫారసులకు లొంగి, ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అతనిపై చర్యలు తీసుకోకుండా, బెళుగుప్ప మండలానికి బదిలీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆ అధికారికి వైసీపీ పెద్దల అండదండలు ఉండడంతో అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదని ప్రచారం ఉంది. పైగా, అక్రమాలను ప్రశ్నించిన ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీ చేయడం గమనార్హం. ఆ అధికారి జిల్లాకు వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తి అవుతున్నా, ఎన్నికల నేపథ్యంలోనూ బదిలీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.





సీఎం జగన్ రాజీనామా చేయాలి

- గ్రూప్-1 ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పుపట్టింది
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, మార్చి 13: ఏపీపీఎస్సీ ద్వారా జరిగిన గ్రూప్-1 పోస్టుల ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పు పట్టినందున.. సీఎం జగన్ నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాయదుర్గంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పుపట్టిందని ఆయన అన్నారు. మెయిన్స్ పరీక్ష పత్రాల రీవాల్యుయేషన్‌ను యూనివర్శిటీ ప్రొఫెసర్ల చేత కాకుండా డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో చేయించారని అన్నారు. కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని అభ్యర్థులు మోపిన అభియోగాన్ని కోర్టు నిర్ధారించిందని అన్నారు. దీని కంటే అవమానం ఈ ప్రభుత్వానికి ఇంకొకటి లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఏపీపీఎస్సీ చైర్మన్‌తోపాటు సీఎం జగన్ రాజీనామా చేయాలని అన్నారు. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి సీతారామాంజినేయులు కుంభకోణానికి పాల్పడ్డారని అభ్యర్థులు మోపిన అభియోగాన్ని కోర్టు ధ్రువీకరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అత్యున్నతమైన గ్రూప్-1 పోస్టుల ఎంపికను ఇష్టారాజ్యంగా చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చామని, మెయిన్స్ ప్రక్రియ అంతా వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిందని అన్నారు. అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్‌ను పక్కన పెట్టి, కార్యదర్శిగా ఉన్న సీతారామాంజినేయులు అక్రమాలకు పాల్పడ్డారని, అనంతరం వచ్చిన గౌతమ్ సవాంగ్ దీనికంతా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వీరెవరికీ ఉద్యోగాల్లో కొనసాగే అర్హత లేదని అన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి ఏకాంతసేవ

తాడిపత్రిటౌన్, మార్చి 13: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. బుధవారంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఏకాంతసేవలో స్వామివారు



గూడుకట్టుకున్న వ్యథ

- తీరని పేదోడి సొంతింటి కల
- పెండింగ్‌లో జగనన్న లేఅవుట్లు
- మంజూరు 41,438.. కట్టింది 10,610 ఇళ్లే
- మిగిలిన వారికి తప్పని ఎదురుచూపులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

అనంతపురం సిటీ, మార్చి 13: నవరత్నాలు- పేదలందరికి ఇళ్ల పథకం పథకం సమస్యలతో సతమతవుతోంది. వైసీపీ అధికారంలోకి రాగానే జిల్లా వ్యాప్తంగా 458 జగనన్న లేఅవుట్స్ పేరుతో 41,438 ఇళ్లను మంజూరు చేశారు. అయితే ఎక్కడా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు సాగలేదు. కొన్నిచోట్ల కోర్టు కేసులతో జగనన్న కాలనీలే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో 10,610 ఇళ్లు మాత్రమే జగనన్న లే అవుట్లలో నిర్మించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరి మిగిలిన 30,828 ఇళ్లను ఇంకెప్పుడు పూర్తి చేస్తారో తెలియని స్థితి. సాధారణ ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తమ గోడు పట్టించుకుంటుందా అనే ఆవేదన లబ్ధిదారుల్లో నెలకొని ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...



- జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లు : 458
- జగనన్న లేఅవుట్లలో మంజూరైన ఇళ్ల సంఖ్య : 41,438
- ఇప్పటికి పూర్తయిన ఇళ్ల సంఖ్య : 10,610
- మిగిలిన ఇళ్ల సంఖ్య : 30,828
- కోర్టు కేసులతో ఆగిన ఇళ్లు : సుమారు 12 వేలకు పైగా
- ఇప్పటికి ఎలాంటి నిర్మాణానికి నోచుకుని ఇళ్ల సంఖ్య : 457

మంజూరు ఘనం.. నిర్మాణాలు అంతంతే...

జిల్లా వ్యాప్తంగా 458 లేఅవుట్లలో అర్హులైన 41,438 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలతో పాటు ఇళ్లను మంజూరు చేసి మమ అనిపించారు. ఇళ్ల నిర్మాణాల విషయంపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి పెట్టలేదు. కనీసం యంత్రాంగాన్ని కూడా ఆ దిశగా నడిపించలేదు. చాలా లేఅవుట్లలో కనీస వసతులు సైతం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు స్తంభించిపోయాయి. ఇసుక, సిమెంట్, బిల్లుల మంజూరు జాప్యంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి సీఎం జగన్ జిల్లా యంత్రాంగంపై నిర్మాణాల వేగం పెంచాలని ఒత్తిడి చేస్తే.. కొంత నిర్మాణాలు సాగినట్లు ఆశాఖ అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఇప్పటికి 12వేల ఇళ్లకు పైగా కోర్టు కేసులు...

గత ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ప్రతి పేదోడికి ఇంటి పట్టాతో పాటు సొంతింటి కల నెరవేరుస్తాం అని సీఎం జగన్ ప్రకటించారు. వైసీపీ పాలనలో 41,438 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 50శాతం ఇళ్లను కూడా ఈ ఐదేళ్లలో పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అనంతపురం, రాప్తాడు, తదితర నియోజకవర్గాల పరిధిలో సుమారు 12వేల మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. కోర్టులో కేసులు ఉండటంతో వీటిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కోర్టు కేసులు ఉన్న స్థలాల్లో ఇంటి పట్టాలు మంజూరు చేయడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోర్టు కేసుల సమస్య ఏర్పడి మూడేళ్లనా దాని పరిష్కారం దిశగా వైసీపీ ప్రభుత్వం ఆలోచించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.



కామారుపల్లిలోని జగనన్న లేఅవుట్



నగర శివారులోని ఆలమూరు జగనన్న లేఅవుట్ ఇలా...

458 జగనన్న లేఅవుట్లలో సమస్యల తిష్ట

జిల్లాలోని అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ప్రభుత్వం 458 జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి అర్హులైన 41,438మందికి ఇంటి స్థలం పట్టాలతో పాటు ఇళ్లను మంజూరు చేసింది. అయితే ఆ లేఅవుట్లలో కనీసం రోడ్లు, కాలువలు, నీరు, విద్యుత్ తదితర వసతులు కూడా లేవు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. కొన్ని జగనన్న లేఅవుట్లు కొండ, గుట్టల్లో ఉండటంతో వివిధ కారణాలను సాకుగా చూపుతూ కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలు కూడా ఇళ్ల నిర్మాణాలు చేయకుండా గాలికి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి.

వేగవంతం చేస్తున్నాం

జిల్లాలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. కొన్ని కోర్టు కేసులతో పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి విడతల వారిగా పూర్తి చేస్తున్నాం. ఇప్పటి వరకు జగనన్న లేఅవుట్లలో 10,610 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.



నరసింహారెడ్డి,
ఇన్‌చార్జి పీడీ, జిల్లా గృహ నిర్మాణశాఖ

వైసీపీకి ఓట్లేస్తే పల్లెలు శిథిలమే

- ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్
- కలెక్టరేట్ ఎదుట సర్పంచుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 13: రాబోవు ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేస్తే పల్లెలు శిథిలమై, గ్రామీణ ప్రజలు నాశమైపోతారని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. దొంగిలించిన రూ.8660 కోట్లు తిరిగి ఇవ్వాలి.. సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిన గ్రామ పంచాయతీలకు సంబంధించిన రూ.8660 కోట్లపై సీబీఐతో విచారణ చేయించి, తిరిగి సర్పంచుల ఖాతాలకు డబ్బు లు జమ చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని అనేక రూపాల్లో నిరసనలు చేపట్టినా ఇప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలను చేసి రాష్ట్రంలోని గ్రామ ప్రజలకు సీఎం జగన్ తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఓడించి, సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు అన్ని పార్టీల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగన్ ఓటమితోనే మన మనుగడ నినాదంతో స్థానిక ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధి, పట్టుదలతో పనిచేయాలని కోరారు. అనంతరరం కలెక్టరేట్ ఏఓకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి , నాయకులు భూషణ్, వేలూరి రంగయ్య, ప్రతాప్‌నాయుడు, ఇస్మాయిల్, ముత్యాలప్ప నాయుడు, లలితమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

- నిబంధనలు ఉల్లంఘించరాదు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా
- ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్న కలెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం టౌన్, మార్చి 13: సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని ఉమ్మడి జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కలెక్టరు, ఎస్పీ, ఇతర ఎన్నికల అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ఫిర్యాదులపై పరిశీలన పూర్తి చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇంకా ఎన్ని ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయి. ఏప ఫాంలు ఉన్నాయెూ ఆరా తీసి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, వసతులు కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని హెచ్చరించారు. పోలీసులు భద్రత విషయంలో నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. సరిహద్దు ప్రాంతాలు. సమస్యాత్మక ప్రాంతాల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికల ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతపురం కలెక్టరు గౌతమి మాట్లాడుతూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని అన్నారు. జిల్లాకు 2,38,849 ఎపిక్ ఓటరుకార్డులు వచ్చాయని, వాటిని ఆయా ఓటర్లకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకోసం అన్నిరకాల ఏర్పాట్లు చేపట్టి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈకాన్ఫరెన్స్‌లో ఎస్పీ అన్బురాజన్. డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి,ఆర్డీఓలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

కన్నీటి సిరాతో..

తండ్రి మరణాన్ని జీర్ణించుకుని ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థి

రోజూ పరీక్షకు తీసుకొచ్చే నాన్న
ఇక రాడని...
భయపడితే ధైర్యం చెప్పే తండ్రి
ఇక లేడని...
ఆ కుమార్తె గుండె తల్లడిల్లిపోయింది.
బాగా చదివి, గొప్పదానివి కావాలన్న
తన అబ్బాజాన్ మాటలను గుర్తుంచుకుని..
ఉబికి వస్తున్న కన్నీటి ప్రవాహానికి
ఆనకట్ట వేయలేని
కను రెప్పలు తుడుచుకుంటూ..
కాలం పెట్టిన 'పరీక్ష'ను
కన్నీటి సిరాతో రాసింది.
ఇంటికెళ్లి ధారలవుతున్న కన్నీటితో
కన్నతండ్రికి కడసారి వీడ్కోలు పలికింది.

తండ్రి మృతి చెందిన బాధను దిగమింగి ఇంటర్ పరీక్ష రాసిన కుమార్తెకు సంబంధించిన ఈ సంఘటన హిందూపురంలో బుధవారం జరిగింది. పట్టణంలో ఈ-టీవీ కంట్రిబ్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న వీడీ సిద్దయ్య(36) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్ల ఉన్నారు. పెద్దకుమార్తె తస్లీం ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తోంది. ఫిజిక్స్ పరీక్షకు బుధవారం హాజరు కావాల్సి ఉంది. ముందు రోజు రాత్రి విద్యార్థిని తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. రోజూ పరీక్ష కేంద్రం వద్ద దించి, ధైర్యం చెప్పివెళ్లే తండ్రి దూరం కావడంతో తస్లీం కన్నీరు మున్నీరైంది. వెక్కి వెక్కి ఏడుస్తూ పరీక్ష కేంద్రానికి చేరుకుంది. తన పరిస్థితిని చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. ఆమె పరీక్ష పూర్తిచేసి వచ్చేవరకూ సిద్దయ్య మృతదేహాన్ని అలాగే ఉంచారు. ఆమె వచ్చి కడచూపు చూసిన తరువాత అంత్యక్రియలకు తరలించారు. సిద్దయ్య మృతదేహానికి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, ప్రముఖులు, విలేకరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



పరీక్ష కేంద్రంలో తస్లీం

- హిందూపురం అర్బన్

నేటి నుంచి గవిమఠం ఉత్సవాలు

ఉరవకొండ, మార్చి 13: వందల ఏళ్ల విశిష్ట చరిత్ర కలిగిన గవిమఠంలోని స్థిత చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ దశమి రోజున మఠం ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవ ఏర్పాట్ల పనులలో అధికారులు నిమగ్నమయ్యారు. గురువారం కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15న నాగాభరణం, 16న నెమలి వాహనోత్సవం, 17న అడ్డపల్లకి ఉత్సవం, ఐరావతవాహనోత్సవం, 18న బసవేశ్వర వాహనోత్సవం, 19న మహా రథోత్సవం, 20న లంకాదహనం, 21న అశ్వవాహనం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ తెలిపారు. బ్రహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మఠం ఆవరణంలో చలువపందిళ్లను వేయించామని ఆయన వెల్లడించారు.



ఏర్పాటు చేసిన చలువపందిళ్లు ఇన్‌సెట్‌లో చంద్రమౌళీశ్వరస్వామి

19 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 13: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 19నుంచి ఏప్రిల్ 2వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆలయ అధికారులు బుధవారం ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బ్రహ్మ రథోత్సవం రోజున తిరువీధులు శుభ్రంగా ఉంచడానికి మున్సిపల్ అధికారులు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయ్యేంతవరకు భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకూడదని సూచించారు. రథం వెనుక మొద్దులు వేసేవారికి ఇబ్బంది లేకుండా తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీవో వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, బీజేపీ నాయకుడు గుడిసే దేవానంద్, రొద్దం ఉత్తమరెడ్డి, తలుపుల గంగాధర్, వైసీపీ నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు విశ్వనాథ్‌రెడ్డి, నాగమల్లు, లోకేశ్వర్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఎంసీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ. (ఆర్20,17) సప్లిమెంటరీతోపాటు ద్వితీయ సెమిస్టర్(ఆర్20,21) సప్లిమెంటరీ పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించినట్లు తెలిపారు. ఎంబీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ. (ఆర్12) సప్లిమెంటరీ. ద్వితీయ సెమిస్టర్(ఆర్21,17) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు ఈబీసీ నేస్తం పథకం లబ్ధి విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి13: ఈబీసీ నేస్తం పథకం మూడో విడత నిధులు గురువారం విడుదల చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన కులాలకు చెందిన 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మహిళలకు రూ. 15 వేలు లబ్ధిని అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20145 మంది మహిళలకు సంబంధించి రూ. 30.21 కోట్లు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు.

రేపు రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 13: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను శుక్రవారం స్థానిక ఆర్డీటీ అనంత క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. సబ్‌జూనియర్ బాల, బాలికల కేటగిరిలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఎంపికైన జట్లకు ఈనెల 20 నుంచి శిక్షణ ఇస్తామని, 28 నుంచి నిర్వహించే జాతీయ సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98495 53603ను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత

పామిడి, మార్చి 13: మండలంలోని రామరాజుపల్లి గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై ఇతర ప్రాంతాలకు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న గోవులను బీజేపీ నాయకులు పట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం వైపునకు ఓ కంటైనర్‌లో సుమారు 40 గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంబడించి దాన్ని ఆపినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కంటైనర్‌ను తెరిచి చూడగా అందులో దాదాపు 40వరకూ గోవులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా గోవులు తరలించేందుకు పాల్పడిన వారందరూ ఒక్కొక్కరుగా అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో బీజేపీ నాయకులు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. గుత్తి, పామిడి బీజేపీ నాయకులు అక్రమంగా తరలిపోతున్న గోవులను పట్టుకోవడంపై హిందూ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి.



కంటైనర్‌లో తరలిస్తున్న గోవులు

రూ. 40 లక్షలతో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

- సహకారం అందించిన మన్నవ మోహనకృష్ణ

హిందూపురం, మార్చి 13: నియోజకవర్గంలో ప్రజలకు నాణ్యమైన శుద్ధ జలాలను అందించాలన్న లక్ష్యంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ మన్నవ మోహనకృష్ణ ఆర్థిక సాయంతో రూ. 40 లక్షలు వెచ్చించి నాలుగు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవి పేర్కొన్నారు. బుధవారం చిలమత్తూరు మండలంలోని మొరంపల్లి, కోడూరు గ్రామాల్లో పట్టణంలోని ముదిరెడ్డిపల్లి, పోచనపల్లి గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, వీటిని వసుంధరదేవి, మన్నవ మోహనకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ 2014లో హిందూపురానికి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ఖాళీ బిందెలతో తాగునీటి కోసం ప్రజలు పడిన కష్టాలను చూశాం. ఎలాగైనా నీటి ఎద్దడి తీర్చాలని సంకల్పించాం. ఈ నేపథ్యంలోనే గుంటూరుకి చెందిన మన్నవ మోహనకృష్ణ సహకారం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం మోహనకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ నియోజకవర్గ ప్రజలను అన్ని రకాలుగా కాపాడుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను చేపడుతున్నార న్నారు. వైసీపీ పాలనలో ప్రజలు తాగునీటి కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇలాంటి నియోజకవర్గంలో ప్రజల కు తాగునీటిని అందించే కార్యక్రమంలో తాను భాగస్వామి కావ డం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇందుకు బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



ముద్దిరెడ్డిపల్లిలో తాగునీటి బిందె అందజేస్తున్న వసుంధర దేవి

ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈగా సుధాకర్‌రెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 13: రోడ్లు భవనాలశాఖ (ఆర్అండ్‌బీ) పరిధిలోని ఎన్‌హెచ్ విభాగం ఈఈగా తిరుపతిలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని అనంతపురానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావును తిరుపతికి బదిలీ చేశారు. నూతన ఈఈ సుధాకర్‌రెడ్డి గురువా రం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ఎన్‌హెచ్ ఎస్ఈ మురళీమోహన్ ఇటీవల విజయవాడకు బదిలీ అయ్యారు. కాకినాడలో పనిచేస్తున్న ఎస్ఈ హరిప్రసాద్ ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఆయన బుధవారం స్థానిక ఆశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆశాఖ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.26 వేలు

అనంతపురంరూరల్, మార్చి 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 363 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు ఆమె వెల్లడించారు.

రికార్డ్ మెజార్టీతో టీడీపీ విజయం

మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా

అనంతపురంరూరల్, మార్చి 13: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్ల కాలనీ, ఉప్పరపల్లి గ్రామంలో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. స్థానిక మండల నాయకులతో కలసి ఇంటింటికి తిరిగారు. బాబు సూపర్ సిక్స్ పథకాలకు కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...: ఉప్పరపల్లిలో 50 కుటుంబాలు వైసీపీలో నుంచి టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి పరిటాల సునీత వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముౠయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, కాపు కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ పాముౠయి వెంకటేష్, తెలుగు మహిళ రాష్ట్ర నాయకురాలు లక్ష్మీదేవి, నాయకులు కురుగుంట నారాయణస్వామి, నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, గోవిందు, బాలరాజు, జగదీష్, నరేష్, రంగనాయకులు, సుశీలమ్మ, ప్రకాష్, మద్దినేని కృష్ణ, బోయభాస్కర్, ఈడిగ వెంకటేష్, సూరి, రత్నమ్మ, సురేష్, సీఎం రాజు, రాము, అక్బర్, బాబు పాల్గొన్నారు.



ఉప్పరపల్లిలో పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



బీకేఎస్ సమావేశంలో అభివాదం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

బుక్కరాయసముద్రం, మార్చి 13: ఐదేళ్ల వైసీపీ అరాచక, దౌర్జన్య, నియంత పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపో యారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి తప్పదని శింగనమల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. స్థానిక చెరువు కట్ట కింద ఉన్న షిర్డిసాయి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఆయా పార్టీల మండల స్థాయి సమావేశంలో ఆమెతో పాటు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జనసేన ఇన్‌చార్జి సాకే మురళీకృష్ణ పాల్గొన్నారు. శ్రావణి మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో వైకాపా చిత్తుగా ఓడిపోవడం ఖాయ మన్నారు. గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జగన్ మళ్లీ అధికా రంలోకి వస్తే రాష్ట్రం ఇక అంధకారమేనని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హను మంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, జనసేన జిల్లా నేతలు లక్ష్మీపతి, అంబారుపు కృష్ణ, టీడీపీ నేతలు కన్వీనర్ అశోక్‌కుమార్, లక్ష్మీనారాయణ, కేశన్న, ఎస్‌నారాయణస్వామి, మల్లికార్జునరెడ్డి, చితంబరి, నరేంద్రయాదవ్, జొన్నరామయ్య ఓబులపతి, జనసేన మండల కన్వీనర్ ఎర్రిస్వామి, చొప్పచంద్రశేఖర్ పాల్గొన్నారు.

శింగనమల: శింగనమల దుర్గాంజనేయస్వామి గుడి వద్ద టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో బుధవారం రాత్రి ఎన్నికల సమావేశం నిర్వహించారు. శింగనమల టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఇందులో మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిస్తే.. ఆ పార్టీయే అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉందని, కావున ఇక్కడ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మారుతినాయుడు మాజీ జెడ్పీటీసీ షాలిని, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, ఈశ్వర్‌రెడ్డి అబ్దుల్ జిలాని, చింతబరి దొర, చిదనందనాయుడు, చంద్రాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, ధను, వెంకటేష్, గుర్రం లక్ష్మీనారాయణ, చిన్నయ్య ప్రతాప్, రాజశేఖర్, సత్తి, జనసేన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, సాకే మురళీకృష్ణ, తోట ఓబిలేసు పాల్గొన్నారు.

ఘన సన్మానం : శింగనమల టీడీపీ పార్టీ అభ్యర్థిగా శ్రావణి ఖరారైన తర్వాత మొదటి సారి శింగనమల మండలానికి ఆమె రావడంతో టీడీపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చిన్నయ్య, పత్రాప్, నాయకులు ఆమెను గజమాలతో సన్మానించారు.

ఓట్ల కోసమే భూమిపూజ

తోపుదుర్తిపై గొరిదిండ్ల గ్రామస్థుల ఆగ్రహం



మాట్లాడుతున్న గొరిదిండ్ల గ్రామస్థులు

ఆత్మకూరు మార్చి 13: రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసమే మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వ అనుమతి లేకుండనే భూమి పూజ చేశారని ఆ గ్రామస్థులు మండిపడుతున్నారు. బుధవారం వారు మీడియా తో మాట్లాడుతూ.. 55 నెలల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా.. ఎన్నికలు వస్తుండటంతో ఓటర్లను మోసం చేయడానికే ఇలాంటి జిమ్మిక్కులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కొత్త నాటకాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజల పట్ల అంత చిత్తశుద్ధి ఉంటే ఇన్ని రోజులు ఎక్కడికి పోయావని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర పధాన కార్యదర్శి పరుశురామ్, మాజీ జడ్పీటీసీ కుళ్లాయప్ప, గ్రామస్థులు బాలానాయక్, రాము, బాబు, ఆనంద్, పోతన్న పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం





అలంకరణలో పోతలయ్యస్వామి, విద్యుత్ దీపాల అలంకరణలో దాదులూరు పోతలయ్యస్వామి ఆలయం

ధర్మవరంరూరల్, మార్చి 13: కనగానపల్లి మండలంలోని దాదులూరు పోతలయ్యస్వామికి జ్యోతుల బోనాలు ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవంలో భాగంగా పోతురాజులు జలధిపూజ చేసి పోతలయ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు జ్యోతుల బోనాలను సమర్పించి ఆలయం చుట్టూ పలహారపు బండ్ల ప్రదర్శన చేపట్టారు. పోతలయ్యస్వామితో పాటు బంగారు లింగమయ్యస్వామి, చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. గురువారం గావుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మామిళ్లపల్లిలో ఎడ్ల ప్రదర్శన

దాదులూరు పోతలయ్యస్వామి జాతర మహోత్సవంలో భాగంగా ఏటా మామిళ్లపల్లి గ్రామంలో పోతలయ్య స్వామికి ఎడ్ల ప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గ్రామంలోని ప్రజలు స్వామికి బుధవారం పెద్దఎత్తున ఎడ్ల ప్రదర్శన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

గార్లదిన్నె, మార్చి 13: అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ తెలిపారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మండలంలో స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు.

ఆస్పత్రిలో ఆరు కొత్త ఓపీ కౌంటర్లు

అనంతపురం టౌన్, మార్చి 13: జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఓపీ కష్టాలు తీర్చడం కోసం కొత్తగా ఆరు ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థ అన్నదానం నిర్వహిస్తున్న ప్రాంతంలో ఈ ఓపీ కౌంటర్లను ఏర్పాటు చేశామని, గురువారం నుంచి ఇక్కడ ఓపీ సేవలు అందిస్తామని తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

నివాళులర్పించిన మాజీ మంత్రి పరిటాల సునీత



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత, (ఇన్‌సెట్లో) సంజీవ రాయుడు (ఫైల్)

రామగిరి, మార్చి 13: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి టీడీపీ సీనియర్ నాయకుడు కుంటిమద్ది సంజీవరాయుడు (85) బుధవారం అనారోగ్యంతో మరణించాడు. మాజీ మంత్రి పరిటాల సునీత ఆ గ్రామానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, రామ్మూర్తినాయుడు, పరందామ యాదవ్, స్థానిక నేతలు ఉన్నారు. ఆయనకు ముగ్గురు ఆనంద్, అశ్వర్థనారాయణ, రాఘవేంద్రతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి సంజీవరాయుడు పార్టీకి సేవలు చేశారు. మండల కన్వీనర్, కుంటిమద్ది సింగిల్‌విండో ప్రెసిడెంట్, కుంటిమద్ది సర్పంచ్ సేవలందించారు.

ఘనంగా కనకదాస విగ్రహ ప్రతిష్ఠ

రాప్తాడు, మార్చి 13: స్థానిక బస్టాండు వద్ద కనకదాస విగ్రహ ప్రతిష్ఠను బుధవారం కురుబల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి కనకదాస విగ్రహాన్ని రాప్తాడులో వైభవంగా ఊరేగించారు. బుధవారం ఉదయం విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కురుబలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కనకదాస విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కురుబలు

సీఏఏతో లౌకికతత్వాన్ని విభజించే కుట్ర

అనంతపురం సెంట్రల్, మార్చి 13: భిన్నత్వంలో ఏకత్వంగా ప్రపంచకీర్తిని గడించిన దేశంలో సీఏఏ ద్వారా లౌకితత్వాన్ని విభజించే కుట్రలు జరుగుతున్నాయని సీపీఐ (ఎంఎల్) నాయకులు మండిపడ్డారు. సీఏఏ అమలును వ్యతిరేకిస్తూ బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్‌వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీఎస్ వలి మాట్లాడుతూ.. మతపర, సున్నితమైన పౌరసత్వ అంశాన్ని సవరణ పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని వాపోయారు. సీఏఏ చట్టాన్ని దేశంలో పలు రాష్ట్రాలు వ్యతిరేకించినా బీజేపీ ముందుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని లౌకికతత్వాన్ని ప్రధాని నరేంద్రమోదీ తూట్లుపొడుస్తు న్నారని మండిపడ్డారు. ఇప్పటికైన అన్ని రాజకీయ పార్టీలు లౌకితత్వాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. బీజేపీ కుట్రలను నిలువరించకపోతే ప్రజాసామ్యంలో మనుగడ కోల్పోతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుజాతమ్మ, ఆదెమ్మ, క్రామూన్‌బీ, పరశురాముడు, మారుతీ, యువజన సంఘం రాజశేఖర్, మల్లి, ఏఐఎస్ఏ జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన, నాయకులు ఆనంద్, యమన్న, అశోక్ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు నివాళి

అనంతపురం అర్బన్/రూరల్, మార్చి 13: కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి సందర్భంగా స్థానిక కుమ్మర శాలివాహన సంఘం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి ఓబులపతి, జిల్లా అధ్యక్షుడు పోతలయ్య, యువజన విభాగం అధ్యక్షుడు భానుకోట రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి కేవీ రమణ, ఓబులేసు, సంఘమేష, వన్నూరుస్వామి, సుబ్బరాయుడు, నరసింహులు, సుధాకర్, నారాయణ, రామకృష్ణ, గోపాల్, నరసింహప్ప, బ్రహ్మ, రాజేశ్వరి, అనిత, రాజి, భారతి, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అనంతపురం టౌన్ : కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలుగు కవయిత్రి మొల్ల చిత్రపటానికి పలువురు అధికారులు నివాళులర్పించారు. ఇందులో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కుమ్మర ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షుడు కుమ్మర ఓబులపతి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

రాప్తాడు, మార్చి 13: మండలంలోని ప్రసన్నాయపల్లిలో 'నీ ఓటు నీ భవిష్యత్తు' కార్యక్రమం పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, ఎంపీడీఓ గీతావాణి, ఏపీఎం నల్లప్ప పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు అనుమతివ్వండి

అనంతపురం క్రైం, మార్చి 13: అనంతపురం నగరంలో సేవా కార్యక్రమాల కింద చలివేంద్రాలు ఏర్పాటుకు అనుమతించాలని వాటర్‌ప్లాంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్, నాయకులు కమిషనర్ మేఘస్వరూప్‌ను బుధవారం కోరారు. కొన్ని సంవత్సరాలుగా వేసవికాలంలో చలివేం ద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది కూడా రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అందుకు కమిషనర్ అనుమ తులు మంజూరు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగన్, హరీష్‌రాయల్ పాల్గొన్నారు.

కుక్కల పట్టివేతకు తాత్కాలిక బ్రేక్

అనంతపురం క్రైం, మార్చి 13: నగరంలో కుక్కల పట్టివేతకు తాత్కాలిక బ్రేక్ పడింది. గత కొన్ని రోజులుగా నగరంలో కుక్కలు పడుతున్న విషయం తెలిసిందే. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన సంతులన్ జీవ్ కళ్యాణ్ అనే సంస్థ పశుసంవర్ధక శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా కుక్కల పట్టివేత, ఆపరేషన్, యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించే కార్యక్రమం చేపట్టింది. బుధవారం నగర కమిషనర్ మేఘస్వరూప్ ఆ సంస్థ ప్రతినిధులకు ఓ నోటీస్ జారీ చేశారు. ప్రాజెక్ట్ గుర్తింపు సర్టిఫికెట్ తీసుకుని రావాలని, అప్పుడే ఈ పనులు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. టెండర్ ప్రకారం ఆరు నెలల్లోపు గుర్తింపు సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉందని, దీంతో తమకు ఇంకా మూడు నెలల సమయం ఉందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయినా నగర కమిషనర్ అందుకు ఒప్పుకోలేదు. ఆ సర్టిఫికెట్ తీసుకొని రావాల్సిందేనని తేల్చిచెప్పారు. దీంతో కుక్కల పట్టివేత కార్యక్రమానికి తాత్కాలిక బ్రేక్ పడినట్టైంది. కాగా, కమిషనర్ హఠాత్తుగా ఆ సర్టిఫికెట్ తీసుకురావాలని ఆదేశాలివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఈవీఎంల పరిశీలన

అనంతపురం టౌన్, మార్చి 13: స్థానిక పాత ఆర్టీఓ కార్యాలయంలో భద్రపరిచిన ఈవీఎంలను నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. రాజకీయపార్టీల ప్రతినిధులు, పలువురు అధికారుల సమక్షంలో గోడౌన్ తాళాలు తీసి.. వాటిని పరిశీలించారు.

టెక్నాలజీతో సమస్యలకు చెక్‌పెట్టాలి : వీసీ

అనంతపురం సెంట్రల్: టెక్నాలజీతో సమాజంలోని సమస్యలకు చెక్‌పెట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. బుధవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో అటల్ టింకరింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం.. విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తోందన్నారు. వాటిని మెంటార్‌లు నేర్చుకుంటేనే సరైన పద్ధతిలో బోధించగలరన్నారు. ఇందులో భాగంగా మూడు రోజుల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, బీసీడీఈ సీఈఓ దేవకుమార్, కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

గుంత తీశారు.. వదిలేశారు

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మురుగు కాలువ నిర్మాణానికి కాంట్రాక్టర్ నెల క్రితం గుంత తీశాడు. అయితే ఆ పనులను ఇంతవరకూ చేపట్టలేదు. రోడ్డు పక్కనే ఇలా గుంత ఉండటంతో.. ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి... మురుగు కాలువ నిర్మాణ పనులను త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలువ కోసం తీసిన గుంత



న్యామద్దలలో..



పంపనూరులో..



కొత్తపల్లిలో..



బాలేపాళ్యంలో..

టీడీపీ విస్తృత ప్రచారం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దలలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు, ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు మండలంలోని పంపనూరు, పంపనూరు తండాలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. రామగిరి మండలంలోని పేరూరు, కొత్తపల్లి, రామగిరి, గంగంపల్లి, పెదయ్యగారికొట్టాల గ్రామాల్లో మండల కన్వీనర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కనగానపల్లి మండలంలోని కోనాపురం, బాలేపాళ్యం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ఎంపీటీసీలు బిల్లేభాస్కర్, శ్రీరాములు, తెలుగు యువత సురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగలింగేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డీ.హీరేహాళ్, మార్చి 13: మండలంలోని నాగలాపురం, చెర్లోపల్లి గ్రామాల నడుమ వెలసిన నాగలింగేశ్వరస్వామి రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా రెండురోజుల పాటు ఆలయంలో ఉత్సవ కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామి వారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన, రుద్రాభిషేకం చేశారు. సాయంకాలం స్వామివారి రథాన్ని భారీపూలు, గజమాలతో అలంకరించి భక్తజన సందోహం నడుమ డప్పు వాయిద్యాలతో ముత్రికొండ వారి ఆధ్వర్యంలో రథాన్ని లాగారు. కర్ణాటక, ఆంధ్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాలాలయంలో భోగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


బాలాలయంలో ప్రతిష్ఠించిన భోగేశ్వరస్వామి విగ్రహం

పామిడి, మార్చి 13: పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా బుధవారం స్వామివారిని ఆఖరిసారిగా విశేష పూజలు చేపట్టారు. ఈఓ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయం ప్రాంగణంలో ప్రసన్న పార్వతీదేవి ఆలయం ముందు నూతనంగా నిర్మించిన బాలాలయంలో భోగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. లింగం ప్రతిష్ఠలో భాగంగా వేదపండితులు ప్రత్యేక హోమాలు, మంత్రోచ్చారణలతో ప్రాణప్రతిష్ఠ, పూర్వ లింగం నుంచి నూతన లింగానికి శక్తులు చేర్చారు.

ఆలయ జీర్ణోద్ధరణకు భూమిపూజ: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలోని పప్పూరమ్మ, భైరవస్వామి దేవాలయ జీర్ణోద్ధరణకు గురువారం భూమిపూజ చేస్తున్నట్లు ఈఓ క్రిష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజీఎఫ్ నిధులలో రూ.కోటి, భక్తుల విరాళాలు రూ.30లక్షలు కలిపి మొత్తం రూ.1.30కోట్లతో పునఃనిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

జయరాంకు ఆలూరు టిక్కెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

గుంతకల్లుటౌన్, మార్చి 13: గుంతకల్లు టీడీపీ టిక్కెట్ ఆర్ జితేంద్రగౌడ్‌కు, మాజీ మంత్రి జయరాంకు ఆలూరు టికెట్ కేటాయించాలని ఆ పార్టీ వాల్మీకి నాయకులు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీమంత్రి జయరాం టీడీపీలో చేరడం సంతోషమే అన్నారు. జయరాం గుంతకల్లులో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తాను, వాల్మీకులు తనకు ఓట్లు వేస్తారని చెప్పుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. వాల్మీకులు అన్ని పార్టీల్లో ఉన్నారని ఆయనకు ఎందుకు ఓట్లు వేస్తారన్నారు. ఆలూరులో జయరాం గెలవలేక పక్క నియోజకవర్గంలో పోతున్నాడని వైసీపీ అభ్యర్థి సవాల్ విసిరాడన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్ పునరాలోచించి జితంద్రగౌడ్‌కు టిక్కెట్ ఇవ్వాలని కోరారు. శివయ్య, తలారి మస్తానప్ప, నందీశ్వర్, పాతకొత్తచెరువు సుంకన్న, నాగరాజు, లక్ష్మీనారాయణ, నెలగొండ లక్ష్మన్న, ఎర్రస్వామి, వీరాంజనేయులు, పులికొండ, వాల్మీకి రాముడు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. చిన్నారి మృతి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 13: మండలంలోని బోరంపల్లి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో 18 నెలల బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామానికి చెందిన చాకలి తిమ్మక్క, కుమారుడు వన్నూరుస్వామి, 18 నెలల బాలుడు ముగ్గురు ద్విచక్ర వాహనంలో భైరసముద్రం గ్రామం నుంచి స్వగ్రామమైన కోనంపల్లికి వెళుతున్న సందర్భంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. ఘటనలో తిమ్మక్క, వన్నూరుస్వామికి స్వల్పగాయాలు కాగా వన్నూరుస్వామి కుమారుడు లోకేశ్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. చిన్నారి మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మార్చి13: పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డులో ఉన్న కేజీబీవీ పాఠశాల వద్దనున్న రైల్వేట్రాక్‌పై పేరం దేవరాజేశ్వర్‌రెడ్డి(46) బుధవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసపురంకు చెందిన దేవరాజేశ్వర్‌రెడ్డి పాలు అమ్ముతూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రమాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి యువకుడు..

గుంతకల్లుటౌన్, మార్చి 13: గుంతకల్లు, కల్లూరు రైలు మార్గంలోని కొనకొండ్ల రైల్వేగేట్ సమీపంలో రైలు కింద పడి భరత్‌కుమార్(25)అనే యువకుడు ఆత్మహత్య చేసుకునానరు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన వివరాల మేరకు పాతగుంతకల్లులోని ఆర్టీటీ కాలనీలో నివాసముంటున్న భరత్‌కుమార్ గత సంవత్సరం బీఏ పూర్తిచేశాడన్నారు. ప్రస్తుతం బెల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. తన అన్న లోకోపైలెట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు, బీఏ చదివినా ఉద్యోగం రాకపోవడంతో చెడు అలవాట్లకు బానిసయ్యాడు. దీంతో జీవతం మీద విరక్తి చెంది మంగళవారం రాత్రి కొనకొండ్ల రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

42 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెద్దవడుగూరు, మార్చి 13: మండలంలోని వీరన్నపల్లి గ్రామంలో 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో విక్రేత రామును అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.3.95 లక్షల నగదు పట్టివేత

కళ్యాణదుర్గం, మార్చి 13: శెట్టూరు మండలం చెక్‌పోస్టు వద్ద చంద్రశేఖర్ అనే వ్యక్తి నుంచి రూ.3.95 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కళ్యాణదుర్గం నుంచి శెట్టూరు వైపుగా వస్తున్న బొలెరో వాహనంలో నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు పరిసర ప్రాంతంలో మామిడి తోపులకు నగదు చెల్లించడానికి వస్తున్నానని చంద్రశేఖర్ తెలిపినట్లు పోలీసులు చెబుతున్నారు. నగదుకు సంబంధించి తగిన ఆధారాలు చూపి తీసుకెళ్లాలని ఆయనకు సూచించారు.

ఎలుగుబంటి దాడి


బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 13: పట్టణంలోని కోట వీధికి చెందిన శ్రీనాథ్ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బహిర్భూమికి వెళ్లగా చెట్ల పొదల్లో వున్న ఎలుగుబంటి దాడి చేసింది. ఆ వ్యక్తి కేకలు వేసుకుంటూ ఇంటికి వచ్చాడు. గాయపడిన శ్రీనాథ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆస్పత్రికి వెళ్లి శ్రీనాథ్‌ను పరామర్శించారు. అనంతరం జరిగిన ఘటనను ఆరా తీశారు.

1994 నాటి ఫలితాలు పునరావృతం

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


రాయదుర్గంలో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 13: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో 1994 నాటి ఫలితాలు పునరావృతం కానున్నాయని, 165 స్థానాల్లోపు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతున్నట్లు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన 17వ వార్డులోని వెంకటేశ్వరస్వామి కాలనీ, కొలిమివీధి, గుగ్గిరెట్టి తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు రక్షణ, సుభిక్షం సాధ్యమని మైనార్టీలు విశ్వసిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల్లో చాలా ప్రాచుర్యం పొందాయన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ చేసిన ప్రచారం పార్టీ పట్ల సానుకూలత పెంచిందన్నారు. జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి అరాచకాలు, విధ్వంసాలు, సంక్షేమంలో కోతలు, అభివృద్ధి లేకుండా చేశాడని, వైసీపీని గద్దె దింపాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథ, టీడీపీ నాయకులు కరెన్న పాల్గొన్నారు.

దుర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దాం

● అమిలినేని సురేంద్రబాబు


మహిళలతో కలిసి ప్రచారం చేపట్టిన అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 13: నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడమే మనందరి ధ్యేయమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని మల్లికార్జున పల్లి, విట్లంపల్లి, హులికల్లు, చాపిరి గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. మహిళలతో కలిసి ప్రచారం చేపట్టి వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి మహిళా లక్షాధికారి అవుతుందని ఆ దిశగా టీడీపీ విజయానికి అహర్నిశలు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అన్ని వర్గాలకు టీడీపీ అండగా ఉంటుందని అమిలినేని అభయమిచ్చారు. నేడు ఏ గ్రామంలో చూసినా టీడీపీ వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని, రోజు రోజుకు పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. ఆ ఆదరణతోనే నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో టీడీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సైనికుల్లా కృషి చేసి సీఎంగా చంద్రబాబును గెలిపించుకోవడమే మన మొదటి కర్తవ్యమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అయా గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

యాడికిని టెక్స్‌టైల్స్ బ్రాండ్‌గా మారుస్తాం

● కుట్టుమిషన్ల పంపిణీలో జేసీ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

యాడికి, మార్చి13: యాడికిని టెక్స్‌టైల్స్ బ్రాండ్‌గా మారుస్తామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్ రెడ్డి అన్నారు. బుధవారం చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీచేశారు. అనంతరం జేసీపీఆర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు యాడికి రూపురేఖలు మార్చానన్నారు. ఇదంతా ప్రజల సహకారంతోనే జరిగిందన్నారు. ఈ సారి తాము అధికారంలోకి వస్తామని యాడికిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామన్నారు. చవ్వా గోపాల్‌రెడ్డి మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకొని జీవనోపాధిని పొందాలని ఆయన సూచించారు. జేసీ అశ్మిత్ రెడ్డి మాట్లాడుతూ వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని యాడికిని అభివృద్ధిచేసి చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎంఎ రంగారెడ్డి, తిరుమలరెడ్డి, కోనుప్పలపాడు సర్పంచు రామలక్ష్మమ్మ, నిట్టూరు సర్పంచు ఈశ్వరమ్మ, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, జేసీడీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరినాథ్‌రెడ్డి, వాగ్దేవి హైస్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, కంబగిరిరాముడు, ఆదినారాయణ, లక్ష్మణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలోకి 40 కుటుంబాల చేరిక


కాలవ శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరుతున్న 7వ వార్డు యువకులు

రాయదుర్గం, మార్చి 13: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన 40 తటస్థ కుటుంబాలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్వగృహంలో వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి చేయడానికి కలిసిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అర్థాంతరంగా ఆగిన ఫ్లైఓవర్లతో పాటు బీటీపీకి కృష్ణాజలాలు లాంటి వాటితో పాటు చేనేత కార్మికుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు. 7వ వార్డు ఇన్‌చార్జి దబ్బుడి శివన్న, నాయకులు పూజారి తిప్పయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు టీడీపీ: జేసీ అశ్మిత్‌రెడ్డి


వృద్ధురాలిని పలకరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి13: అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3, 4వార్డుల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

టీడీపీలో అన్నివర్గాల వారికి సంక్షేమం

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అన్నారు. బుధవారం మండలంలోని కొంతానపల్లి గ్రామంలో టీడీపీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రార్థించారు. రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని రాయదుర్గం నియోజకవర్గంలో కాలవ శ్రీనివాసులు మరొకసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. మండల కన్వీనర్ హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సిద్ధప్ప, మాజీ సర్పంచ్ హనుమంతు, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, నాగిరెడ్డిపల్లి హనుమంతు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

బొమ్మనహాళ్: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప అన్నారు. బుధవారం మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాలవ శ్రీనివాసులుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి వీఎల్ రామాంజనేయులు, సర్మాస్‌వలి, ఆనంద్, నాగరాజు, ముక్కన్న, రామస్వామి, రఫీ, చెన్నప్ప, సంతోష్, ఎల్లప్ప, వన్నూరుస్వామి, రాజు పాల్గొన్నారు.


కొంతానపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న కాలవ భరత్


దర్గాహొన్నూరులో...

రుణాలు రెన్యువల్ చేసుకోండి

బ్రహ్మసముద్రం, మార్చి 13: భైరవాన్‌తిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు 31వ తేదీలోగా వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రామాంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. సంఘంలో క్రాప్ లోన్, కమర్షియల్ లోన్స్ తదితర రుణాలు పొందిన రైతులు రెన్యువల్ చేసుకుంటే 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

యల్లనూరు, మార్చి 13: తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నాయకుడు రామాంజనేయులు తెలిపారు. సమావేశానికి శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీతోపాటు, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

పది పరీక్షలకు కేంద్రాల ఏర్పాటు

బొమ్మనహాళ్, మార్చి 13: మండలంలో 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు మల్లికార్జున, వీరన్న తెలిపారు. పరీక్షల నిర్వహణకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బొమ్మనహాళ్‌లోని జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ఉద్దేహాళ్‌లోని జడ్పీ హైస్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. బాలురు 429, బాలికలు 463 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులను వారు పరిశీలించారు.

16న రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం

తాడిపత్రిటౌన్, మార్చి 13: పట్టణంలోని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో 16వ తేదీన రాఘవేంద్రస్వామి 428వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పాదపూజ, కనక మహాపూజ, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పారదర్శక ఎన్నికలకు సహకరించండి: జేసీ

ఉరవకొండ, మార్చి 13: పారదర్శక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నిక షెడ్యూల్ తర్వాత కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. నామినేషన్లకు సంబంధించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈఆర్వో శిరీష, తహసీల్దార్లు శ్రీనివాసులు, హరినాథ్, టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, గోవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనా, సీపీఎం నాయకులు మధుసూదన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు ఆదినారాయణ మృతి



పామిడి, మార్చి 13: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ ఆదినారాయణ బుధవారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. ఆదినారాయణ మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ నాయకులు అన్నారు.

విలేకరికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, మార్చి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి గోరంట్ల నాగరాజుకు బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ రూ.15వేలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడెల అపర్ణ చంద్రశేఖర్ రూ.5వేలు, దాతలు రూ.15వేలను నాగరాజు ఇంటికి వెళ్లి ఆయన సోదరుడికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు జీఎం రఫీ, సభ్యులు వెంకటరాముడు, హరగోపాల్, శ్రీనివాసులు, అక్బర్, చంద్ర పాల్గొన్నారు

విద్య ప్రాధాన్యంపై అవగాహన

రాయదుర్గంరూరల్, మార్చి 13: విద్య ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొంతానపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతానపల్లి గ్రామంలో జాతీయ సేవా పథకం ఏడురోజుల ప్రత్యేక శిబిరం ఐదవరోజు కార్యక్రమంలో అక్షరాస్యత, విద్యా ప్రాధాన్యత అంశాలపై అవగాహన చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అప్పుడే వ్యక్తులు, కుటుంబం, సమాజం బాగుంటాయని అన్నారు. హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సర్పంచ్ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న క్రైస్తవులు, టీడీపీ నాయకులు

తాడిపత్రిటౌన్, మార్చి 13: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సుంకులమ్మ పాలెంకు చెందిన పలువురు క్రైస్తవులు స్వచ్ఛందంగా ప్రచారానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి సైకిల్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

బ్రహ్మసముద్రం, మార్చి 13: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పోలేపల్లి సర్పంచ్ శెట్టిగారి మంజునాథ ఆకాంక్షించారు. బుధవారం గుండిగానపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదతో తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు.

పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

తాడిపత్రిటౌన్, మార్చి 13: రాబోయే ఎన్నికల దృష్ట్యా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బుధవారం డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు కవాతు చేశాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్, గాంధీ కట్ట, మెయిన్‌బజారు, ఆంజనేయస్వామి విగ్రహం, అశోక్‌పిల్లర్, సీబీ రోడ్డులో కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పట్టణ సీఐ మురళీకృష్ణ, రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, యాడికి సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐలు రామకృష్ణ, గౌస్‌బాషా, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు విడపనకల్లులో గురువారం కవాతు నిర్వహించాయి. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టారు. కవాతులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. సీఐలు ప్రవీణ్‌కుమార్, సురేష్‌బాబు, తహసీల్దారు దస్తగిరి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్, మార్చి 13: మండల కేంద్రంలో బుధవారం 11కేవీ విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ కావడంతో నాలుగు గడివాములు దగ్ధమైన సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు బొమ్మనహాళ్‌కు చెందిన కంప్లి వంద్రప్ప అనే రైతు పశువుల మేత కోసం గడ్డిని కొనుగోలు చేసి గ్రామ శివారులో నాలుగు వాములు ఏర్పాటు చేశారు. పైన 11కేవీ వైర్లు ఉన్నాయి. ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. రాయదుర్గం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ ఇంజన్ ఆలస్యం అయ్యింది. జిందాల్‌కు చెందిన ఫైర్ ఇంజిన్‌ను రప్పించి మంటలను అదుపు చేశారు. పశుగ్రామం పూర్తిగా కాలిపోయింది. రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామనివాసి అప్పిరెడ్డికి చెందిన సొప్పవామికి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. రూ.20 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

పూరిగుడిసె...

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామ రైతు వలిసాబ్‌కు చెందిన పూరిగుడిసెతో పాటు డ్రిప్ పరికరాలు, ఎండుమిర్చి తదితర వ్యవసాయ పరికరాలు దగ్ధం కావడంతో రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. కణేకల్లు క్రాసింగ్‌లో రైతుకు ఉన్న ఐదెకరాల పొలంలో పూరిగుడిసె వేసుకుని వ్యవసాయం చేసుకుంటూ ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పూరిగుడిసెకు నిప్పుపెట్టడంతో అందులోని సామగ్రి మొత్తం దగ్ధమైంది. దీనిపై బాధిత రైతు మాట్లాడుతూ ప్రభుత్వమే తనను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కరివేపాకుతోట...

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు విజయభాస్కర్‌రెడ్డికి చెందిన కరివేపాకు పంట, డ్రిప్‌పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలమేరకు సుమా రు రెండు ఎకరాల్లో కరివేపాకు పంట గట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.


పుట్లూరు మండలం చింతకుంటలో పూర్తిగా కాలిపోయిన కరివేపాకు పంట